నేడు విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-పార్వతీపురం

బెలగాంలో డివిఎంఎంఎ పాఠశాలలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరవుతారని చెప్పారు. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలపై మరో వడ్డన

- పెరగనున్న రిజిస్ట్రేషన్ ఫీజులు
- రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం
- ఇప్పటికే ఛార్జీల భారం

అదనమంటున్న వ్యాపారులు

ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా జనంపై కొత్త భారం వేసేందుకు సిద్ధమైంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ఫీజును పెంచుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని పాలనాపరమైన ఉత్తర్వులను ఆయా శాఖల అధికారులకు అందించింది. భూములు, స్థలాలు, ఇళ్ల క్రయ, విక్రయాలపై రిజిస్ట్రేషన్ల భారం పడనుంది. కమర్షియల్ ఏరియాకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనపు ఛార్జీలు కొనుగోలుదారులు చెల్లించాల్సి ఉంది. నూతన పాలసీ ప్రకారం భూముల విలువ 10 నుంచి 15 శాతం పెరగనుంది.

ప్రజాశక్తి-విజయనగరం

ఉమ్మడి జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, గజపతినగరం, చీపురుపల్లి, రాజాం, సాలూరు, పాలకొండ, శృంగవరపుకోట వంటి పట్టణాలతోపాటు ఎయిర్‌పోర్టు పుణ్యమా! అని భోగాపురం పరిసర ప్రాంతాల్లో భారీగా భూముల ధరలు పెరిగాయి. వీటి పరిధిలో రియల్‌ఎస్టేట్ రూపంలో అమ్మకాలు కూడా జోరుగానే సాగుతుంటాయి. కానీ, గతేడాది సార్వత్రికల ఎన్నికల అనంతరం జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామాల్లో కూడా భూముల క్రయవిక్రయాలు తగ్గాయి. ఇలాంటి తరుణంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా భూముల ధరలను మరింత పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు పట్టణాలు, గ్రామాల్లో ఒకేసారి కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు అమల్లోకి రానుంది. గత ప్రభుత్వ విధానంలో మాదిరిగా భూముల రిజిస్ట్రేషన్లలో అసమానతలు లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. నిర్ణయం ఏదైనా జనంపై మాత్రం భారం తప్పడం లేదు. భూముల రిజిస్ట్రేషన్లతోపాటు భవన నిర్మాణాల విలువను కూడా పెంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచనున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని దాదాపు అన్ని భూములపై 10 నుంచి 15 శాతం ఛార్జీలు అదనంగా పెరగనున్నాయి.

15 శాతం పెంపుదల ఇలా

ప్రస్తుతం ఎకరా ధర రూ.20 లక్షలు ఉంటే, ఆ భూమిని బయట వ్యక్తులకు విక్రయిస్తే రిజిస్ట్రేషన్ ఫీజు 7.5 శాతం అంటే.. రూ.1.50 లక్షలు వసూలు చేస్తారు. రాబోయే కాలంలో 15 శాతం భూమి విలువ పెంచితే ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.3 లక్షలు చొప్పున పెరిగి, దాని విలువ రూ.23 లక్షలు అవుతుంది. ఈ విధంగా చూస్తే దీనిపై రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1,72,500 పడుతుంది. అంటే అదనంగా రూ.22,500 వరకు కట్టాల్సి ఉంది. ప్లాట్లు, ఇళ్ల కొనుగోళ్లపైనా దాదాపు ఇదే తరహాలో భారం పడనుంది.

క్రయవిక్రయాలపై ప్రభావం

జిల్లాలో ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ నేపథ్యంలో కొందరు వారి ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు పొలాలు, స్థలాలను అమ్మకాలు చేస్తుంటారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు తరచూ పెరుగుతుండటంతో ఆ ప్రభావం భూముల క్రయవిక్రయాలపై పడుతోంది. రిజిస్ట్రేషన్ ఛార్జీల భారంతో అమ్మకాలు బాగా తగ్గిపోతాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపుతో మరింత పతనం అవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. కరోనా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రియల్ ఎస్టేట్ రంగం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు నిర్ణయంతో కుప్పకూలిపోయే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. భూముల విలువ, రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోరుతున్నారు.

గిరిజన విద్యకు ప్రాధాన్యత కరువు

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి - కురుపాం

జిల్లాలో గిరిజన విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించకపోవడం చాలా దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. గురువారం కురుపాం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో విద్యార్థుల మరణాలు తరచూ సంభవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంలను నియమిస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చి సంతకం పెట్టారని, ఆర్నెల్లు గడిచినా హామీ అమలుకు నోచుకోలేదని చెప్పారు. తక్షణమే హామీని చేసి ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్‌చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని కోరారు. విద్యార్థుల మరణాలు సంభవిస్తే, ప్రభుత్వం ఉపాధ్యాయులపై నిందమోపడం సరికాదన్నారు. కురుపాంలో రూ.150 కోట్లతో చేపట్టిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణం దాదాపు 70 శాతం పూర్తయిందని, మిగతా పనులు పూర్తిచేయాలని, గిరిజన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యనందించాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.వై. నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు బి.వి.రమణ, నాయకులు కూరంగి సీతారాం, మండంగి అడ్డమేశ్వరరావు, ఉలక వాసు తదితరులు పాల్గొన్నారు.

12న యూత్ ఉత్సవ్

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 12న యూత్ ఉత్సవ్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వెల్లడించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో యూత్ ఉత్సవ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని సెట్విజ్, లయన్స్ క్లబ్, ఐఆర్‌పిడబ్ల్యుఎ, విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఆధ్వర్యంలో స్థానిక లన్స్ క్లబ్‌లో యూత్ ఉత్సవ్ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొనే విధంగా కృషి చేసి విజయవంతం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంత యువతలోని సృజనాత్మకత వెలికితీసేందుకు యూత్ ఉత్సవ్ సదావకాశమని చెప్పారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమోంటోలు బహూకరించనున్నామని, పాల్గొన్న వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేయనున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 98484 18582, 63046 37663 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, సెట్విజ్ సిఇఒ రాజగోపాల్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి.ఎన్.బి.రావు, సామాజిక కార్యకర్త యు.శ్రీహరి, ఐఆర్‌పిడబ్ల్యుఎ సంస్థ డైరెక్టర్ పి.ప్రకాశ్, యువజన సభ్యులు గణేష్, సత్యనారాయణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

డైరీల ఆవిష్కరణ

ఉద్యోగ సంఘాల, వివిధ శాఖల నూతన ఆంగ్ల సంవత్సర డైరీ, కేలెండర్లను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో రెవెన్యూ అసోసియేషన్, ఇరిగేషన్, రహదారులు, భవనాల శాఖ, మున్సిపల్ ఎంప్లాయీస్ వర్క్ చార్జర్ల అసోసియేషన్ డైరీలు, కేలెండర్లను ఆవిష్కరించారు.

4న యువజన ఉత్సవ్

పార్వతీపురంటౌన్ : జిల్లా యువజన ఉత్సవ్-2024ను ఈ నెల 4న నిర్వహించనున్నట్టు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట ఉజ్వల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఏటా జనవరి 12న జాతీయ యువజనోత్సవాలు జరుపుకుంటున్నామని చెప్పారు. ఈసారి జిల్లా యువజన ఉత్సవ్ కార్యక్రమం ఈ నెల 4న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. జిల్లా యువజన ఉత్సవ్‌లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులు, యువతకు జానపద నృత్యాలు, గీతాలు, రకరకాల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

ఆర్‌టిసిలో అక్రమ బదిలీలు ఆపాలి

ఎస్‌డబ్ల్యుఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఆర్‌టిసిలో అక్రమ బదిలీలు, సస్పెన్షన్లు ఆపాలని వక్తలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాది టి.జోగారావు మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులకు తూట్లు పొడుస్తూ కార్మికులతో చెలగాటమాడిన దేశాలు గానీ, ప్రాంతాలు గాని అభివృద్ధి చెందినట్టు చరిత్రలో లేదన్నారు. విధానపరమైన లోపాలను కప్పిపుచ్చేందుకు కార్మికులపై జులుం ప్రదర్శించడం సరికాదన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు చేసే చిన్న చిన్న తప్పులకు సస్పెన్షన్లు, బదిలీ చేయడం చాలా అన్యాయమని మండిపడ్డారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అనంతరం ఎస్‌డబ్ల్యుఎఫ్ విజయనగరం జోనల్ అధ్యక్షులు వి.రాములు మాట్లాడుతూ ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం చేసే భవిష్యత్తు పోరాటాలకు పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. యజమాని చేతిలో కార్మికులు కీలు బొమ్మలు కారని, ఎదురించే శక్తి ఉమ్మడిగా మనందరిలో కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలని, ఎంవిఎ సెక్షన్ 124 ప్రకారం టికెట్ తీసుకోవాల్సిన బాధ్యత ప్రయాణికులపై ఉండాలని, టికెట్ లేని ప్రయాణానికి 500 రూపాయలు జరిమానా విధించాలని సూచించారు. చట్ట వ్యతిరేకమైన జిఒ 70లో సమూలంగా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ పార్వతీపురం డిపో అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.సింహాచలం, ఐర్ల సంఘం నాయకులు పి.సంగం, ఎఐఎస్ఎఫ్ నాయకులు బి.రవికుమార్, ఎఐవైఎఫ్ నాయకులు బి.టి.నాయుడు, ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో ఉపాధ్యక్షులు ఎస్.అప్పలరాజు, ఆర్‌టిసి ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

శంబర జాతరకు పక్కాగా ఏర్పాట్లు

అధికారులకు కలెక్టర్ ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

శంబర జాతరకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే శంబర పొలమాంబ జాతర ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం శంబర జాతరను రాష్ట్ర పండగగా ప్రకటించిన విషయం తెలిసిందే. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి అడుగూ పకడ్బందీగా వేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అత్యంత జాగురుకతతో వ్యవహరించాలన్నారు. తాగునీటి సరఫరా కొరత లేకుండా చూడాలని, అవసరమయ్యే పైప్ లైన్లు ముందుగా వేసి నిరంతర సరఫరా ఉండాలని ఆదేశించారు. తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన మరుగుదొడ్లు నిర్మించాలని చెప్పారు. విద్యుత్ సరఫరాలో సరైన పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. భక్తుల నడక మార్గంలోను, క్యూలైన్లకు వెళ్లే దారిలోనూ ఎటువంటి ఆటంకమూ ఉండరాదని స్పష్టంచేశారు. చిల్లర దుకాణాలు ఏర్పాటుకు కొన్ని స్థలాలు గుర్తించి, అక్కడే ఏర్పాటు చేయాలని సూచించారు. నడక దారిలో ఎక్కడా అడ్డంగా దుకాణాలు ఉండరాదని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని అన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. ప్రజలు పోలమాంబ దర్శనం చేసుకునేందుకు ప్రజా రవాణా శాఖ తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్యూలైన్లు, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు సక్రమంగా ఏర్పాటు చేయాలని, ఆలయానికి ఆనుకుని ఉన్న గోముఖి నది వద్ద స్నానాలు, వంటలు చేపట్టడంపై దృష్టి సారించాలని తెలిపారు. పోలీసులు బందోబస్తు, కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు నిర్వహణ పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకుండా చూడాలని ఆదేశించారు. జాతర చూసేందుకు ప్రజలు ఎక్కే ఏనుగు కొండ వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి పాయింట్ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రదర్శన శాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎఎస్‌పి దిలీప్ కిరణ్, డిపిఒ టి.కొండల రావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఒ.ప్రభాకర్ రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి వి.ఎస్.నగేష్ బాబు, డిఇఒ ఎన్.తిరుపతినాయుడు, ఇపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజనీర్ కె చలపతిరావు, జిల్లా విపత్తుల స్పందన అధికారి కె. శ్రీనుబాబు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం.శశికుమార్, ఆహార తనిఖీ అధికారి వై.రామయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి-పార్వతీపురం

మైనారిటీ యువతకు నైపుణ్య అభివృద్ధిలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇడి ఆర్ఎస్ జాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సొసైటీ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ జనరేషన్, ఎంటర్ ప్రైస్ డెవలప్మెంట్ సౌజన్యంతో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. జిల్లాలోని ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైనులు తదితర మైనారిటీలకు చెందిన యువతకు ఆసక్తి గల రంగంలో నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. శిక్షణ మూడు నెలలు ఉంటుందని, ఈ కాలంలో వసతి, యూనిఫాం, భోజనం, స్టడీ మెటీరియల్ అందిస్తామని వివరించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని తెలిపారు. అర్హులైన మైనారిటీ అభ్యర్థులు వారి విద్యార్హతలు, వయస్సు, ఆధార్, చిరునామా, ఫోన్ నెంబరు తదితర వివరాలతో బయో డేటాను విజయనగరం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 08922-230250/ 94900 66050/ 99086 67294 నంబర్లను సంప్రదించవచ్చని చెప్పారు.

8న దిశా సమావేశం

జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్తు సిఇఒ బివి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరకు ఎంపి గుమ్మ తనూజరాణి అధ్యక్షతన పార్వతీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి జరుగుతుందని ఆయన చెప్పారు. కమిటి సభ్యులు, అధికారులు సమావేశంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు చలో విశాఖ డెయిరీ

ప్రజాశక్తి-సీతానగరం

పాల సేకరణ ధర పెంచాలని శుక్రవారం చేపట్టే చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి పాలరైతు సంఘం జిల్లా నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి ఈశ్వరరావు ఒక ప్రకటనలో పాల రైతులను కోరారు. విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల ధర లీటరుకు రూ.3 నుండి రూ.4 వరకు తగ్గించిందన్నారు. దీనిపై ఎపి పాలరైతు సంఘం ఆధ్వర్యాన చేపడుతున్న చలో విశాఖ డెయిరీ కార్యక్రమానికి తరలిరావాలని విజ్ఞప్తిచేశారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విస్తృత ప్రచారం

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలో పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి విస్తృతంగా పర్యటించారు. గురువారం మండలంలోని ఆర్.వెంకంపేట, సీతానగరం, బూర్జ, నిడగల్లు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని, ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 33 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేశానని తెలిపారు. విద్యారంగ సమస్యల పట్ల పూర్తి అవగాహన తనకు ఉందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో గొంతు వినిపించే అవకాశం తనకు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై నిబద్ధతతో నిస్వార్థ పోరాటం చేస్తున్న పిడిఎఫ్‌కు అవకాశం ఇవ్వాలని, ఉత్తరాంధ్ర నుంచి మండలిలో మొదటి మహిళా ప్రాతినిధ్యాన్ని బరపరచాలని కోరారు. ఈ పర్యటనలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బొత్స ప్రసాదరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూరాడ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరులోగా జిల్లాలోని ప్రభుత్వ పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని జిల్లా ట్రెజరీ అధికారి ఎ.మన్మథరావు చెప్పారు. గురువారం జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించకపోతే పింఛన్లు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా సెల్‌ఫోన్లలో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించవచ్చునని తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పింఛనుదారుల సంఘం కార్యాలయంలో వారికి అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించడంపై అవగాహన లేని వారు జిల్లా ట్రెజరీ కార్యాలయం, సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో సంప్రదిస్తే సహకారం అందించనున్నట్లు చెప్పారు. ఆధార్ నెంబర్, స్మార్ట్ ఫోన్ ఉంటే యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించవచ్చునని వివరించారు.

లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్న జిల్లా ట్రెజరీ అధికారి మన్మథరావు

పార్వతీపురంటౌన్ : ప్రభుత్వ పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పింఛనుదారుల సంఘం జిల్లా కార్యదర్శి డి.గణపతి రావు అన్నారు. గురువారం స్థానిక పింఛనుదారుల భవనంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను సంఘ గౌరవ అధ్యక్షులు మంచిపల్లి శ్రీరాములు, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా ట్రెజరీ అధికారి ఎ.మన్మథరావు ప్రారంభించారు.

గిరిజనుల భూముల్లో చేపడుతున్న హైవే పనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు ఈశ్వరరావు, శ్రీనివాసరావు

గిరిజనులకు పరిహారమివ్వాలి

ప్రజాశక్తి-పాచిపెంట

గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయిన మోదుగ పంచాయతీ కాట్రగుడ్డి, బంగారుగుడ్డి గిరిజనులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు, మండల నాయకులు కొర్ర శ్రీనివాసరావు డిమాండ్‌చేశారు. గురువారం ఆ గ్రామాల్లో చేపడుతున్న హైవే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు లేకపోవడం వల్ల పరిహారం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూములతోపాటు అటవీ ఉత్పత్తులైన చింత, సీతాఫలాలు, కుంకుడు, కాగు చెట్లు మొత్తం ఈ రహదారిలో పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా జీవనాధారం కోల్పోయిన రెండు గ్రామాల గిరిజనులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బాధిత గిరిజనులకు పరిహారం మంజూరు చేయాలని కోరారు.

బాక్సింగ్‌లో హేమంత్ సత్తా

ప్రజాశక్తి-కొమరాడ

అంతర్జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌లో కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి తెంటు హేమంత్ సత్తాచాటాడు. 48 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించాడు. దీంతో విద్యార్థి హేమంత్‌ను ప్రిన్సిపల్ వై.నాగేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

హేమంత్‌ని అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి
www.prajasakti.com

పాడి రైతుల సమస్యలపై
నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు గురువారం ఒక ప్రకటనలో కోరారు. పాలకు గిట్టుబాటు ధర లేక కుదేలవుతున్న రైతులకు సహకరించాల్సిన విశాఖ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరను అమాంతంగా తగ్గించిందని తెలిపారు. రైతులకు రాయితీలు, ఇతర సౌకర్యాలు కల్పించకుండా యాజమాన్యం ప్రవర్తిస్తున్న తీరు, అందుకు ప్రభుత్వం సహకరిస్తున్న వైనం దారుణమని పేర్కొన్నారు. దీనిపై చేపట్టే ధర్నాకు పాడి రైతులు తరలిరావాలని కోరారు.

డిపోకు చేరుకున్న కొత్త బస్సులు

ఆర్‌టిసి డిపోకు మూడు కొత్త బస్సులు

ప్రజాశక్తి-పాలకొండ

ఆర్‌టిసి పాలకొండ డిపోకు గురువారం కొత్తగా మూడు బస్సులు ప్రభుత్వం కేటాయించింది. మూడు ఎక్స్‌ప్రెస్ బస్సులను పాలకొండ డిపో సిబ్బంది కోటదుర్గమ్మ ఆలయానికి తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పట్నాల వెంకటేశ్వరరావు, డిపో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానిక్) ఎల్.రాము, తదితరులు పాల్గొన్నారు.

కుంతాంలో డిఎంఒ పర్యటన

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని కుంతాం గ్రామంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ గురువారం పర్యటించారు. జీవాల మలేరియా బారిన పడిన బోయిన అమూల్య ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి మాధవి ఇంటింటి సర్వే నిర్వహించి, జ్వరాలున్న వారికి మందులు అందజేశారు. మలేరియా అని గుర్తిస్తే వెంటనే సమూల చికిత్స అందజేయాలని స్థానిక ఆరోగ్య కార్యకర్త వెంకటరమణకు ఆయన సూచించారు. అనంతరం పాచిపెంట పిహెచ్‌సిని సందర్శించారు. ప్రతిరోజూ వస్తున్న జ్వరాలు గురించి వైద్యాధికారి వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో అన్నిరకాల టెస్టులు ప్రజలకు అందుబాటులో ఉంచాలని సంబంధిత వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఈశ్వర్‌రావు, ఆశాలు పాల్గొన్నారు.

6 వరకు గ్రామసభలు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో ఈ నెల 2 నుంచి ఆరో తేదీ వరకు చట్టపరమైన గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం తెలిపారు. గురువారం మండలంలోని కిరప, దేవనాపురం, కడగండి తదితర పంచాయతీల్లోని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో కొత్త పనులు చేపట్టాలన్నారు. తాగునీటి వనరులను సంరక్షించుకోవాలని చెప్పారు. బహిర్భూమికి బయటకు వెళ్లకుండా మరుగుదొడ్డి వినియోగించుకోవాలని తెలిపారు. ఇంటి పన్ను పన్నుల లక్ష్యాలను అధిగమించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టర్ శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండల కేంద్రంలో పలువురిని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆంధ్రపత్రిక రిపోర్టర్ శ్రీనివాస్ నివాసానికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీనియర్ నాయకులు గంటా జగం ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలుసుకొని, ఆయన్ను కూడా పరామర్శించారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, నాయకులు రామారావు, మన్మధ, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజన్నదొరకు శుభాకాంక్షలు తెలుపుతున్న బ్రహ్మకుమారి

రాజన్నదొరకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సాలూరు

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొరకు ఈశ్వరీయ బ్రహ్మకుమారీ విద్యాలయ ప్రతినిధులు గురువారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాజన్నదొర నివాసానికి వెళ్లి ఆయనకు బ్రహ్మకుమారీలు పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు బ్రహ్మకుమారీలతో కలిసి వెళ్లారు.

వ్యాధులపై కళాజాతాతో అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

వ్యాధుల బారిన పడకుండా గిరిజన గ్రామాల్లో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజమహేంద్రవరం విఆర్ఎస్ రూరల్ మీడియా బృందం కళాజాతా ద్వారా అవగాహన కల్పించింది. గురువారం మండలంలో మొండెంఖల్ పిహెచ్‌సి పరిధిలోని జీలుగుమానుగూడ, అధ్వానంగూడ, లంకజోడు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు బి.ప్రజ్ఞ, కె.వి.హర్ష, వైద్య సిబ్బంది ఎ.నాగేశ్వరరావు, జె.తిరుపతిరావు, సుజాత, సుప్రియ, జ్యోతి పాల్గొన్నారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కేంద్రంలోని ఎన్.టి.ఆర్. నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రం(మహిళా ప్రాంగణం) అధ్వర్యంలో గృహిణులు, యువతులకు వివిధ వత్తి శిక్షణ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమల తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో అందించే ఈ శిక్షణ కోర్సును బట్టి 30 నుంచి 60 రోజుల కాలవ్యవధి ఉంటుందని పేర్కొన్నారు. అర్హత వుండి ఆసక్తి కలిగిన మహిళలు, యువతులు జనవరి 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. సూయింగ్ మెషిన్ ఆపరేటర్, మగ్గం వర్కు, బేకరి ఉత్పత్తులు తయారీ శిక్షణ కోర్సులకు 8వ తరగతి చదివిన వారు అర్హులని వెల్లడించారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ శిక్షణకు 10వ తరగతి చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ కోర్సుల శిక్షణ పొందగోరే మహిళల వయసు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వుండాలని తెలిపారు.

కోతకు గురైన పైపులైన్ కల్వర్టు

పూడ్చితేనే... లేకుంటే ప్రమాదమే!
గోముఖి నదిపై కోతకు గురైన కల్వర్టు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని శంబర గ్రామ సమీపంలో ఉన్న గోముఖి నదిపై నిర్మించిన పైపులైను కల్వర్టు నదీ ప్రవాహానికి సగభాగం కోతకు గురైంది. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో జరిగే పోలమాంబ జాతరకు చెముడు గ్రామం మీదుగా వచ్చే యాత్రికులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి వెంటనే పైపులైన్ కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఇక్కడ కాజ్‌వే నిర్మాణం చేపడితే ఏటా ఈ రకమైన ఇబ్బందులు తలెత్తే ఆస్కారం ఉండదని అభిప్రాయ పడుతున్నారు

ధాన్యం బస్తాలకే షెల్టర్

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని ఎస్.పెద్దవలసలో నిర్మించిన బస్‌షెల్టర్ వ్యాపారులకు గోదాముగా మారింది. ఆర్‌టిసి బస్సుల కోసం వచ్చే ప్రయాణికులు వేచి ఉండేందుకు విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. అయితే ప్రయాణికులకు చోటు లేకుండా కొంతమంది రాజకీయ నాయకులు అండతో వ్యాపారులు ధాన్యం గోదాముగా మార్చేశారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టి, ప్రయాణికులకు సౌకర్యం కలిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

బస్‌షెల్టర్‌లో వ్యాపారులు నిల్వ చేసిన ధాన్యం బస్తాలు

దట్టంగా కురుస్తున్న మంచు

మంచు కురుస్తోంది.. బయటకు రాలేం

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణంలో గత మూడు రోజులుగా దట్టంగా మంచు కురుస్తోంది. ఉదయం 9 గంటలు దాటినా మంచు దుప్పటి వీడటం లేదు. దీంతో ఆలోపు ఇళ్లల్లో నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు ఆసక్తి చూపించడం లేదు. పనులపై బయటకు వచ్చే వాహనచోదకులు వాహనాల లైట్లు వేసుకుని రాకపోకలు సాగించే పరిస్థితి నెలకొంది. ఒకవైపు మంచు, ఇంకోవైపు చలితో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులు ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు. పనులపై బయటకు వచ్చే సమయంలో రక్షణ దుస్తులను ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

పౌష్టికాహార కిట్లు సిద్ధం చేయండి
కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

అంగన్వాడీల ద్వారా గర్భిణులకు అందించేందుకు అవసరమైన పౌష్టికాహార కిట్లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య, ఐసిడిఎస్, డిఆర్‌డిఎ తదితర అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటుందన్నారు. ఎక్కువగా చింతపండు వినియోగించడం ద్వారా హిమోగ్లోబిన్ తగ్గే అవకాశం ఉందని, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. చింతపండుకు బదులుగా పులుపునిచ్చే ఇతర కాయగూరలను వంటల్లో వినియోగించుకునేలా ప్రజలకు వివరించాలని కలెక్టర్ సూచించారు. గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్న సంగతిని గుర్తుచేశారు. దీంతోపాటు జిల్లా యంత్రాంగం తరపున అదనంగా న్యూట్రిషన్ విలువలు కలిగిన డ్రైఫ్రూట్స్, పండ్లను అందించేలా కిట్లను సిద్ధం చేయాలని చెప్పారు. ఇందుకోసం స్థానిక స్వయం సహాయక మహిళా సంఘాలు, ఐసిడిఎస్ లేదా ఇతర వ్యాపారవేత్తలతో మాట్లాడి సిద్ధం చేసుకోవాలని కోరారు. ఈ కిట్లను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రితో ప్రారంభోత్సవం చేయించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయపార్వతి, నోడల్ అధికారి ఎం.వినోద్ కుమార్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి వాగ్దేవి, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, గ్రామ,వార్డు సచివాలయాల సమన్వయాధికారి బి.రామ్ గోపాల్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవసరమైన ఎరువులే వాడాలి

పాచిపెంట.. రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రజాశక్తి-పాచిపెంట

ఎరువుల ఉపయోగాలను తెలుసుకుని, సరైన సమయానికి వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని తాడూరు గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నత్రజని ఎరువు యూరియా రూపంలో వేస్తున్నారని, ఇది పంట పెరుగుదలకు ఉపయోగపడుతుందని చెప్పారు. మూడు దశల్లో సిఫార్సు చేసిన మోతాదులో యూరియాను వేసుకోవాలని చెప్పారు. భాస్వరం ఎరువు వేరు వ్యవస్థ వృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. విత్తనంతోపాటు లేదా ఆఖరి దుక్కిలో లేదా విత్తనం నాటిన వారం రోజుల్లోపు మాత్రమే డిఎపి లేదా 20-20-0-13 వంటి కాంప్లెక్స్ ఎరువులను వేసుకోవాలని చెప్పారు. పొటాష్ ఎరువు పంట ఆరోగ్యానికి, దిగుబడికి, నాణ్యతకు సంబంధించినదని, నిర్ణీత మోతాదులో రెండు భాగాలుగా చేసి విత్తనంతో పాటు ఒకసారి, పూత దశలో రెండో సారి వేసుకోవాలని తెలిపారు. విచక్షణా రహితంగా ఎరువులు వాడితే ఖర్చు పెరిగి దిగుబడి తగ్గడమే కాకుండా భౌతిక, రసాయనిక స్వభావం దెబ్బతింటుందని సూచించారు. అనంతరం మొక్కజొన్న క్షేత్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

జీడి సస్యరక్షణపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం : రైతులు జీడి మామిడి తోటల సస్యరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌ఛార్జి కిమిడి భూషణ అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ రేగులపాడులో రైతులకు అవగాహన కల్పించారు. పుల్లటి మజ్జిగ, పంచగవ్య, పేడ మూత్రం ద్రావణం, ద్రవ జీవామృతం ఉపయోగాలు, వాటి తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంటి నిర్మలదేవి, ఎల్.దీప, విఎఎ రవికుమార్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం... సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి బొంగు సురేష్

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ప్రతి విద్యార్థీ పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ గౌరునాయుడు, డిఆర్‌సిఆర్‌లు ఉన్నారు.

ఎస్ఎంసి చైర్మన్లకు శిక్షణ

భామిని : ప్రతి పాఠశాలలో విద్యాభివృద్ధికి ఎస్ఎంసి చైర్మన్లు కృషి చేయాలని ఎంఇఒలు ఎ.శ్రీనివాసరావు, వి.భాస్కరరావు కోరారు. భామిని ఆదర్శ పాఠశాలలో గురువారం వివిధ పాఠశాలల ఎస్ఎంసి చైర్మన్లకు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. స్కూల్ నిర్వహణ కమిటీ బాధ్యతలు, బాలల హక్కులు, విద్యార్థులు అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్రపై శిక్షణ అందించారు. ఈ శిక్షణ రిసోర్స్ పర్సన్లుగా తిరుపతిరావు, ధనుంజయ, ప్రసాద్ రావు వ్యవహరించారు.

రమేష్ కుటుంబానికి రూ.50 వేలు సాయం



నగదు అందజేస్తున్న మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం క్రీడా మైదానంలో నిర్వహించిన కందికొత్తల ఉత్సవాల్లో పాల్గొని ప్రమాదవశాత్తు వేడి సాంబారు టబ్బులో పడి మృతి చెందిన రమేష్ కుటుంబానికి మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి రూ.50 వేలు ఆర్థిక సహాయం చేశారు. గురువారం చెముడుగూడ గ్రామానికి వెళ్లి బంధువులను పరామర్శించారు. అనంతరం గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. రమేష్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపిలు కె.దీనమయ్య, శెట్టి పద్మావతి, సర్పంచుల సంఘం అధ్యక్షులు బొత్తాడ శంకరరావు, ఎల్విన్‌పేట సర్పంచి ఆర్.చైతన్య స్రవంతి, వైసిపి నాయకులు జి.గిరిబాబు, కొత్తకోట కిశోర్‌కుమార్, వహీద్ ఖాన్, వెంకటరమణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సాయం

రమేష్ కుటుంబానికి గుమ్మలక్ష్మీపురం హెల్పింగ్ హాండ్స్ సభ్యులు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచి బొత్తాడ గౌరీశంకర్ రావు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పాలక ప్రేమానంద్, టి వినోద్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని ఎల్ఎల్‌పురం విఆర్‌ఒగా పనిచేస్తున్న ఎస్.రెయ్యన్న(50) గురువారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. కొద్ది రోజుల క్రితం శ్రీకాకుళం రిమ్స్‌లో చేరిన ఆయన గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య ధనలక్ష్మి ఉన్నారు. సుమారు మూడేళ్ల క్రితం ఆయన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రెయ్యన్న మృతికి వీరఘట్టం, పాలకొండ రెవిన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

సీతానగరం : ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరని ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక హనుమాన్ జంక్షన్‌లో గురువారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాన్ని నడపరాదన్నారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సందీప్, జయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపట్టడంతో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇఇ గోపాలకృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపేస్తున్నట్లు చెప్పారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వైద్య సేవలపై అడిగి తెలుసుకుంటున్న జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్

గిరిజనులు అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేయాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహనరావు సూచించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో ఇరిడి, లిక్కిడి, మండ, పి.ఆమిటి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో ఆరోగ్య సర్వేలు ఏమేరకు చేపడుతున్నారు, వ్యాధులను గుర్తించడం, చికిత్స, నివారణకు చర్యలు, తదితర అంశాలపై సిబ్బందిని ఆరాతీశారు. ఆరోగ్య సర్వే రికార్డులు పరిశీలించారు. దీర్ఘకాలిక రోగుల పర్యవేక్షణ, కొత్తగా నమోదైన ఎన్‌సిడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గృహ సందర్శనలు చేసి వృద్ధులు, గర్భిణులు, బాలింతలతో ఆయన మాట్లాడి, ఆరోగ్య స్థితిగతులను, అందుతున్న వైద్య సేవలపై తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎత్తు పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. చిన్నారులతో మాట్లాడి వారి పరిజ్ఞానాన్ని గమనించారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో మందుల లభ్యత, వాటి కాలపరిమితి తేదీలను తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. ప్రతిరోజూ కేంద్రంలో ఎంతమందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారని రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య సమస్యలు స్పష్టంగా తెలుసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

అనంతరం పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల హిమోగ్లోబిన్ పరీక్షల, ఆరోగ్య వివరాల రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు వైద్య సిబ్బంది ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు వేయడాన్ని గమనించారు. సిక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయగౌడ్, యర్రాయమ్మ, ప్రధానోపాధ్యాయులు పార్వతి, వైద్య సిబ్బంది మౌనిక, సునీత, జ్యోతిలక్ష్మి, శాంతి, దివ్యభారతి, యమున, రత్నప్రసాద్, ప్రకాశ్, అంగన్వాడీ సిబ్బంది సుబ్బలక్ష్మి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్‌వై నాయుడు, తదితరులు

4న ట్రాన్స్‌పోర్టు కార్మికుల సదస్సు

ప్రజాశక్తి-సాలూరురూరల్

మోటార్ రంగంలో ఉన్న కార్మికుల సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 4న సాలూరు లారీ ఓనర్స్ కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్‌వై నాయుడు తెలిపారు. సదస్సుకు సంబంధించిన ప్రచార కరపత్రాన్ని లారీ ఓనర్స్ కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మోటారు కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని కోరారు. ఈ సదస్సుకు ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.లక్ష్మయ్య హాజరవుతారని చెప్పారు. సాలూరు ప్రాంతంలో ఉన్న మోటార్ కార్మికులు, యజమానులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోట శ్రీనివాసరావు, కె.రాంబాబు, పి.రామారావు, బలరాం, శంకర్రావు పాల్గొన్నారు.

లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రయివేట్‌పరం చేయొద్దు

కొమరాడ : ఆటో, మోటార్ కార్మికులకు భారంగా మారే లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రయివేట్ పరం చేయొద్దని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొమరాడలో గురువారం ఆటో కార్మికుల సంఘం నాయకులు గోపితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుండి ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు కల్పిస్తామని చెప్పడం శుభపరిణామని అన్నారు. ఇలాంటి సందర్భంలో లక్షలాది మంది ఆటో కార్మికులకు కూడా భరోసా కల్పించే విధంగా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మక్కువ

గ్రామ స్థాయిలో ఎనిమిక్ యాక్షన్ కమిటీలు ఏర్పాటు చేయాలని మండల ప్రత్యేకాధికారి తిరుపతయ్య సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో రక్తహీనతను అధిగమించాలన్న అంశాలపై పలువురు అధికారులతో ఎంపిడిఒ స్వరూపరాణి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలోనూ గర్భిణులను రక్తహీనత లోపించకుండా పర్యవేక్షించే కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందించే మందులతోపాటు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహార కిట్లు అందరికీ అందేలా చూడాలన్నారు. వాటిని గర్భిణులు వినియోగించడంతోపాటు ఆకుకూరలు కూడా ఆహారంలో ఎక్కువ శాతం తీసుకునేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య, అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడిచినా, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒరిగిందేమీ లేదని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎ.సూర్యనారాయణ అన్నారు. గురువారం మండలంలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రివర్గ సమావేశం జరుగుతుందంటే ఏదో మేలు చేకూరుతుందన్న ఆశతో ఎదురుచూడడం, సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు వారిని నిరాశపరచడం సర్వసాధారణమైందన్నారు. గత ప్రభుత్వంలో రావాల్సిన బకాయిలు లేవని, ఈ ప్రభుత్వంలో ఇవ్వాల్సిన డిఎలు, ఐఆర్, పిఆర్‌సికి సంబంధించిన కమిషన్లు నియమించలేదని చెప్పారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరుబాట పట్టక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.తవిటినాయుడు, కాగాన విజయ్, కార్యనిర్వాహక అధ్యక్షులు గంట శశికుమార్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భోగి రవికుమార్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EP 28/2024 in O.S. 34/2023

Between :
గంట నాగరాజు ....D.Hr
And :
మండవిల్లి సోమశేఖర్ ....J.Dr
J.Dr
మండవిల్లి సోమశేఖర్, S/o వెంకటరాజు, వ॥ 40సం॥లు, Door No.47-24/4, గొర్లెవీధి, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా.

పై అమలు పిటిషనులో J.Dr అయిన మీకు శ్రీ కోర్టువారు నోటీసు జారీ చేసినప్పటికి సదరు నోటీసును మీరు తీసుకోకుండా కాలయాపన చేయచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేస్తూ సదరు పై E.P. ని తే 20-1-2025ది నాటికి వాయిదా వేసినారు. కావున మీరు పై తేదీన స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలెను. పై E.P. ని **తే 20-1-2025దీన ఉదయం గం॥ 10-30 ని॥లకు** శ్రీ కోర్టువారు పరిశీలించుదురు గాన మీకు తెలిజేయడమైనది.

LAVUDI EKADANTESWARA RAO
D.Hr తరపు న్యాయవాది, సాలూరు,
సెల్: 9440913367, 9912320210